క్లుప్తంగా

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న సభ్యులు

చీమకుర్తి: రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం చీమకుర్తిలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడవా రామకృష్ణ, కార్యదర్శిగా కందుకూరి సుధాకర్, ట్రెజరర్‌గా దుద్దు శంకర్‌ను ఎన్నుకున్నారు. టీ రాజశేఖరరెడ్డి, మహ్మద్ రఫీ ఇన్‌స్టలేషన్ అధికారి, ఇండక్షన్ అధికారిగా వ్యవహరించి నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇప్పటి వరకు అధ్యక్షులుగా వ్యవహరించిన గుండా చినవెంకటేశ్వర్లు గత రెండు సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను వివరించారు. రానున్న రోజుల్లో రోటరీ క్లబ్ తరపున సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నట్లు నూతన కార్యవర్గం భరోసా ఇచ్చింది. కార్యక్రమంలో రోటరీ క్లబ్ నిర్వాహకులు చెరుకూరి రఘుకిరణ్, గొల్లపూడి వెంకట్రావు, డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు, మన్నం నాగరాజు, అంబటి వీరారెడ్డి, పరాంకుశం శ్రీనివాసమూర్తి, పోకూరి రామకృష్ణారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు ఫీడర్‌లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ చెన్నారెడ్డి తెలిపారు. ఫీడర్ పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తున్నామని, అందువలన వినియోగదారులు సహకరించాలని ఒక ప్రకటనలో ఆయన కోరారు.

కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్‌కు ఘనంగా వీడ్కోలు



సూర్యప్రకాశరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు: ఒంగోలు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.సూర్యప్రకాశరావు ఉద్యోగ విరమణ చేయడంతో ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక, గోవా, అస్సాం, మణిపూర్‌తో పాటు మన రాష్ట్రంలో 32 సంవత్సరాల పాటు అధ్యాపకవృత్తి కొనసాగించడం జరిగిందన్నారు. సొంత ఊరు అయిన ఒంగోలులో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించి ఇక్కడే ఉద్యోగ విరమణ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా పాఠశాల అభివృద్ధికి కేంద్రం నిధులు రూ.2 కోట్లు తెప్పించామన్నారు. రూ.1.50 కోట్ల వ్యయంతో పాఠశాల ఆవరణలో భారీ షెడ్డు నిర్మించడం జరిగిందన్నారు. తన సర్వీసును మెచ్చుకుని కేంద్ర స్కూల్స్ సర్వీస్ శాఖ 2000 సంవత్సరంలో మూడు రాష్ట్రాలకు సీబీఎస్ఈ అబ్జర్వర్‌గా కూడా నియమించిందన్నారు. అనంతరం స్టాఫ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌తో పాటు బంధుమిత్రులు ఘనంగా ఆయనను సత్కరించారు.

వైభవంగా సిరిమానోత్సవం

- భక్తిశ్రద్ధలతో నాంచారమ్మతల్లి బ్రహ్మోత్సవాలు
- భారీగా తరలివచ్చిన భక్తులు



ఆలయం వద్ద భారీగా ఉన్న భక్తులు



సిరిమానును తాకుతున్న భక్తులు

కొత్తపట్నం: స్థానిక నాంచారమ్మతల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సిరిమానోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సెలవుదినం కావడంతో కొత్తపట్నం, మండలంలోని గ్రామాలతో పాటు ఒంగోలు నగరం నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి సైతం జనం తరలిరావడంతో కొత్తపట్నం, చుట్టుపక్కల ప్రాంతాలన్నీ జనజాతరను తలపించాయి. ఆదివారం ప్రతిఇంట్లో పొంగళ్లు పెట్టుకుని మేళతాళాలతో ఊరేగించుకుంటూ అమ్మవారి ఆలయానికి చేరుకుని ఆలయం చుట్టూ తిరిరి మొక్కులు చెల్లించుకున్నారు. 40 అడుగుల సిరిమానును తంబి వెంకట్రావు కుమారుడు ఉదయ్ కుటుంబీకులు ఆలయానికి బహూకరించారు. భక్తులు తీసుకొచ్చిన మేకపోతులను సిరిమాను చుట్టూ తిప్పి గ్రామంలో వదిలిపెట్టారు. వాటిలో ఒక మేకపోతును సిరిమాను బోనులో బంధించి ఆ మేకపోతును ఉంచిన సిరిమానును ఆలయం చుట్టూ తిప్పారు. ఆలయం నుంచి ఆర్చి దగ్గరకు మేళతాళలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. అప్పటికే ముస్తాబు చేసిన 5 కుంకుమబండ్లను వరుసగా నాంచారమ్మతల్లి ఆలయం చుట్టూ తిప్పి సిరిమాను దగ్గరకు చేరుకున్నారు. ముందు సిరిమాను, వెనుక మొక్కుబడి కుంకుమబళ్లన్నింటినీ మేళతాళాలతో ఊరేగించుకుంటూ ఈతముక్కల బజార్, పోస్టాఫీస్ బజార్, బీచ్ బజార్, శివాలయం వీధి, తుమ్మలకూరి పాలెం మీదుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. సిరిమాను ఉత్సవాన్ని చూడటానికి అన్ని రహదారులు జనసంద్రంగా మారాయి. సిరిమాను ఉత్సవంలో అందరూ సిరిమాను, కుంకుమ బండ్లు, ఎడ్లను తాకి నమస్కరించుకున్నారు. తేజ ఆర్ట్ క్రియేషన్స్ కె.పల్లెపాలెం వారిచే స్నేహం కోసం సాంఘిక నాటకం ప్రదర్శించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు.





ఊరేగింపులో కుంకుమ బండ్లు



నాంచారమ్మతల్లికి పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

విలేకరులపై దాడికి యత్నించిన ఆక్రమణదారుడు



విలేకరిని దుర్భాషలాడుతున్న ఆక్రమణదారుడు



వాగును ఆక్రమించి నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్

మద్దిపాడు: ఓ ఆక్రమణదారుడు ఏకంగా విలేకరులపై దాడికి యత్నించిన ఘటన ఆదివారం మధ్యాహ్నం మద్దిపాడు మండలంలోని మల్లవరం గ్రామంలో చోటుచేసుకుంది. ఆ వివరాల ప్రకారం.. మండలంలోని దొడ్డవరం, తెల్లబాడు గ్రామాలకు చెందిన ప్రజలకు నీరు అందించడానికి 20 సంవత్సరాల క్రితం మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవాలయానికి దిగువ భాగంలో రిజర్వాయర్ ద్వారా వచ్చే ఊటనీటిని ఏర్పాటు చేశారు. ఆ నీరు దూకుడు వాగులోకి వస్తుండగా, దాని పక్కనే ఊటబావి ఏర్పాటు చేసుకున్నారు. అక్కడి నుంచి ఆయా గ్రామాలకు నీరు వస్తుంది. అయితే, ఊట బావి సమీపంలో ఓ టీడీపీ సానుభూతిపరుడు వాగును ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నాడు. గ్రామస్తుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఇద్దరు విలేకరులు ఊట బావి వద్దకు వెళ్లి పరిశీలించి అక్రమ కట్టడాల ఫొటోలు తీసుకున్నారు. అక్కడే ఉండి వీఆర్‌ఏ ద్వారా సమాచారం సేకరిస్తుండగా, సదరు ఆక్రమణదారుడు వచ్చి విలేకరులను మీరెవరంటూ ప్రశ్నించాడు. విలేకరులమని వారు చెప్పినప్పటికీ.. ఇక్కడ మీకేంపనిరా అంటూ అసభ్యపదజాలంతో దుర్భాషలాడాడు. అదే సమయంలో దాడికి ప్రయత్నించాడు. పైగా, ఎమ్మెల్యేతో మాట్లాడి మీ అంతు చూస్తా అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. వీడియో తీస్తున్న మరో విలేకరిని రికార్డింగ్ ఆపాలంటూ బూతులు తిట్టాడు. దీనిపై గ్రామ సర్పంచ్‌ని ప్రశ్నించగా, మల్లవరం వెంకటేశ్వరస్వామి కొండ కింద సుమారు 7 ఎకరాల డీకే భూమి ఉందని, దానిని పట్టా భూమిగా ఎవరు కన్వర్షన్ చేశారో తేల్చాలని డిమాండ్ చేశారు. సదరు ఆక్రమణదారుడు 180 లింకులున్న వాగును ముప్పాతిక భాగం ఆక్రమించాడని, గ్రామ సర్వేయర్ జడా శ్రీనివాసరావు ఆ విధంగా వాగు పోరంబోకును ఆక్రమణదారుడికి ధారాదత్తం చేసి లబ్ధిపొందాడని ఆరోపించారు. ఆక్రమణదారుడు మూడు సెంట్లు తనకు పట్టా ఉందని చెబుతున్నాడన్నారు. దీనిపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

శాకంబరీదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు



లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో శాకంబరీదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు

ఒంగోలు మెట్రో: స్థానిక లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి ఆదివారం ఆలయ అర్చకులు అభిషేకం, అర్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షిరిడీ సాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో ఉదయం ఏడు గంటలకు అమ్మవారి మూలవిరాట్‌కు అర్చకులు శ్రీ సూక్తంతో పంచామృతాభిషేకం, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరీదేవిగా అమ్మవారిని అలంకరించి శ్రీచక్రానికి కుంకుమతో అర్చన చేశారు. కర్పూర హారతితో భక్తులకు శాకంబరీదేవిగా రాజరాజేశ్వరీదేవి దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆశీసులు అందుకున్నారు.



సంతపేట సాయిబాబా మందిరంలో శాకంబరీదేవిగా నాగలక్ష్మి అమ్మవారు

సంతపేట సాయిబాబా మందిరంలో...

సంతపేట సాయిబాబా మందిరంలోనూ శాకంబరీదేవిగా నాగలక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకుడు ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం నాగలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌ను వివిధ రకాల కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించారు. మహిళా భక్తులు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అలహరి చంచలరావు, సాయి యువసేన, సాయి మహిళా సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా రమణ మహర్షి సత్సంగం

ఒంగోలు మెట్రో: స్థానిక లాయర్‌పేట రమణ ప్రశాంత కేంద్రంలో కొప్పోలు హనుమంతరావు ఆధ్వర్యంలో ఆదివారం రమణ సత్సంగం, వేదాంత ఉపనిషత్తు నిర్వహించారు. అందులో భాగంగా సాయంత్రం ఏడు గంటలకు ప్రముఖ అధ్యాపకుడు కొప్పోలు ఫణిరాజు మాట్లాడుతూ రమణ మహర్షి బోధించిన వేదము, ఉపనిషత్తు తత్వాన్ని వివరించారు. ముఖ్యఅతిథిగా కాలభైరవ ఉపాసకుడు మైనంపాటి సాయి పాల్గొని మాట్లాడారు. రమణ మహర్షి ఆశ్రమానికి వెళ్లినప్పుడు మనకు తెలియకుండానే ఏదో ఒక శక్తి మనల్ని లాగుతున్నట్లు అనిపిస్తుందన్నారు. ఏదో తెలియని ప్రశాంతత మనకు అక్కడ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి వెంకట శేషయ్య, డాక్టర్ రాయపాటి ప్రసాదరావు, చివుకుల చిరంజీవి, గుడ్లూరి రామచంద్రరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

వేములకోటలో ఘనంగా పీర్ల పండగ



వేములకోటలో పీర్ల ఊరేగింపు

మార్కాపురం రూరల్: మండలంలోని వేములకోట గ్రామంలో గత మూడు రోజులుగా పీర్ల పండగను భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి పెద్ద సరిగెత్తు సందర్భంగా పీర్లచావిడి దగ్గర నిప్పుల గుండంలో పలువురు భక్తులు పీర్లను ఎత్తుకుని నడిచారు. వేములకోట, కొట్టాలపల్లి, వేములపేట గ్రామాల్లో ఆదివారం పీర్లను ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పీర్లకు బొరుగులను నైవేద్యంగా సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భక్తులు సందడి చేశారు. వేములకోటలో సంప్రదాయం ప్రకారం కొందరు భక్తులు వివిధ వేషధారణలతో అలరించారు.

వేడుకగా పోలేరమ్మ తల్లి పొంగళ్లు

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు గ్రామంలో శనివారం రాత్రి, ఆదివారం గ్రామ దేవత పోలేరమ్మతల్లికి గ్రామస్తులు ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. కుంకుమ బండ్లు, బోనాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. సకాలంలో వర్షాలు పడి గ్రామం పాడిపంటలతో కళకళలాడాలని అమ్మవారికి పూజలు చేశారు. అలాగే గ్రామ దేవత యల్లమ్మతల్లికి పొంగళ్లు పెట్టి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



బోనాలతో భక్తులు